కథ



# ఎవరు తాగుబోతు!

ఎలచ్చన్లంటే నాకు మా. బాగా సరదా. అన్ని పార్టీలోళ్ళు చేతినిండా డబ్బిత్తారు. కూలీనాలీ చేయ నక్కర్లా. ఇక. సారా గురించి సరేసరి. ఆనెళ్ళాళ్ళు పండగే పండగ. ఈసారి ఎలచ్చన్లలో అన్ని పార్టీ లోళ్ళు సారా అమ్మకాలు ఆపేత్తాం, ఆపేత్తాం అని ఒకటే గొడేవ. అది ఇంటున్నప్పసడల్లా ఒకటే నవ్వొచ్చేది. ఓట్ల కోసం మాకు పీపాలకు పీపాల సారా ఇస్తున్నారు. వీరా సారా ఆపేదని. స్టేజి మీద మాత్రం సారా రాచ్చసని. తరిమేత్తాం అని ఉపన్యా సాలు దంచేస్తున్నారు. ఈళ్ళ డ్రామాలకి మొత్తం ఆడోళ్ళు పడిపోయారు. మా ఇళ్ళులు బాగు పడతాయని ఆనందించారు. ఒక్కుమ్మడిగా ఓట్లు గుద్దేసారు. నటులు పీఠాలెక్కారు. అధికారం ఆళ్ళ సొంతమైంది. ఏదో స్టేజి మీద వాగారులే ఈళ్లేం సారా ఆవుతారని అనుకునేలోగా ఆ పని చేయనే చేసారు. నా పై ప్రాణాలు పైనే పోయాయి. నా జీవితంలో మూడొంతులు పైగా సారా లో మునిగి తేలినా. మా ఇంటిని మొత్తం గుళ్ళ చేసినా. భార్యా పిల్లలకు దూరమైనా. ఇప్పడు సారా తాగద్దంటే తట్టుకోగలనా? సారా బట్టీలు మొత్తం మూత పడనై. పోలీసోళ్ళ గస్తీ ఎక్కువైనాది. సారా దొరకటంలా. ఒళ్ళు ఏమీ చేవని మొరాయిస్తోంది. ఒక వారం రోజులు పన్లోకి కూడా పోలా. మా ఊరి పెసిడెంట్ బామ్మర్ది పొలాలలో దొంగ సారా అమ్ముతున్నాడని మా ఇంటి పక్క ఎల్లయ్య చెపితే లగెత్తుకు పోనా. నా రోజులు బాగోక అక్కడికి అప్పడే పోలీసోళ్ళు వచ్చారు. మమ్మల్నందర్నీ విరగకొట్టారు. ఒంటి మొత్తం మీద ఒక్క అంగుళం కూడా ఒదల్లా మా సర్వం చోడి బామ్మర్ది ఎలాగో బయట పడ్డాడు. కుండ దగ్గరకి పోయి మంచినీళ్ళు తీసుకోలేక పోయే వాడ్ని. మా ఆడది పన్లోకి పోయేది. అయినా వారానికి మూడు రోజులు పస్తులుండే వాళ్ళం. దాని కష్టాన్ని చూడలేక పోయేవాడ్ని. మూడు నెలల తరువాత పన్లోకి కొంత ఓపిక చేసుకొని వెళ్ళాను. కొద్ది రోజులకి నా ఆరోగ్యం కుదుట పడింది. సంపాదన ఎక్కువైనాది. రెండు పూటలా మంచిగా అన్నం తినేవాళ్ళం. సారా గురించి మర్చిపోయినా. ధర్మ ప్రభువులు మా జీవితాలు బాగు చేసారని ఎంతో ఆనందపడి పోయేవాళ్లం. నా భార్యా పిల్లల్లో అంత ఆనందాన్ని నేనెప్పడూ చూడలా. నా కడుపు దాంతోనే నింటి పోతోంది. **సారా ఆపడం వల్ల ఖజానాకి చిల్లు పడుతున్నా** ప్రభుత్వం ఎంత మంచిపని చేస్తోంది. మనసుంటే మార్గముంటుందంటే ఇదే గాభోలు. నా కథ ఇలా సుఖాంతం అవుతుందనుకోలా. కొంత సొమ్మును బాంక్‌లో దాచేవాడ్ని. పెద్ద పిల్ల ఎదుగుతోంది. దాన్ని సంబంధాలు చూడండని మా ఆడది ఆ మధ్యన చెప్పింది. ఆ పనిలో తిరుగుతున్నా. ఇంతలో పేపర్లో మళ్లీ సారా అమ్ముతారని చదివినా. చాలా బాధేసింది. నా ఆశలు పేక మేడల్లా కూలిపోతున్నట్టుంది. వద్దు వద్దు అని అరుద్దామనుకున్నా. ఊరూ వాడా తిరిగి చెపుదామనుకున్నా. ఐనా నా మాటకి విలువేది. సారా ఇచ్చారు. మా పేట మొత్తం పండగ జరుపుకుంటోంది. అందరూ తప్ప తాగి రోడ్లపైన డాన్సులు చేస్తున్నారు. ఆ పేటంతా ఒక్కటే సారా వాసన. ఆ వాసన నన్ను ఏదో మాయలోకి లాగుతోంది. ఐనా మనసుని నిగ్రహించరకున్నా. రెండు రోజులు గడిచినై. ఇంక ఉండలేక పోనా. నరాలు తోడేస్తున్నట్టు ఒకటే బాధ. సారా బట్టీ వద్ద పరిగెట్టినా రెండు గ్లాసులు తాగా. ఏనుగెక్కినంత ఆనందంగా ఉంది. ప్రపంచం మొత్తం జయించాననుకున్నా. ఇక ఇది నాకు పూర్తిగా మళ్ళీ అలవాటైంది. మా ఆడది చెవిసిల్లు కట్టుకుని పోరేది. నా పిల్లలు కాళ్ళా వేళ్ళా పడి బతిమాలిడినా నే మానలా. ఇల్లు గుల్లవ్వడం ప్రారంభమైంది. డబ్బులు జేబులో ఆడట్లా. ఆరోగ్యం క్రమంగా పాడైనాది.పెద్ద పిల్లకి పెళ్ళి ఆశ రోజు రోజుకీ తగ్గుతోంది. తాగటం వల్ల ఒళ్ళు మొత్తం నీరైంది. ఏ పని చేయలేక పోయేవాడ్ని. చివరకు మంచం కూడా దిగలేక ఆ ఆవిడ సంపాదిస్తుంటే దాన్ని తిడుతూ, కొడుతూ సారా తెమ్మనే వాడ్ని. ప్రభుత్వం ముందూ వెనకా ఆలోచించకుండా సారా ఆపేరు. మా జీవితాలు బాగుపడ్డాయను లోపలా మళ్ళీ సారా ఇచ్చారు. మా కడుపులు కొట్టారు. ఇప్పడు నాలో ఒక ప్రశ్న దొలిచేస్తోంది. నేను తాగుబోతునా లేక ప్రభుత్వమా?

– మేడూరి గోపాలకృష్ణ,

తణుకు.